# వేములవాడ.. ప్రగతిబాట



## స్వరాష్ట్రంలో ₹4,500 కోట్లతో అభివృద్ధి

- సీఎం కేసీఆర్ సంకల్పం.. ఎమ్మెల్యే రమేశ్‌బాబు కృషి
- తొమ్మిదిన్నరేండ్లలో ప్రగతి పయనం
- రాజన్నపై అపవాదును తొలగించిన ముఖ్యమంత్రి
- దివ్యధామంగా ఎములాడ క్షేత్రం
- ముంపు గ్రామాల సమస్యలకు పరిష్కారం
- మెట్ట ప్రాంతం సస్యశ్యామలం
- మల్కపేట రిజర్వాయర్ పూర్తి
- కొత్తగా రెవెన్యూ డివిజన్, మూడు మండలాలు
- చేరువైన విద్యా, వైద్యం
- ఇంటింటికీ సంక్షేమం
- సబ్బండవర్గాల ఆనందం

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)/వేములవాడ: భీమ కవి నుంచి మొదలు జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సీ నారాయణ రెడ్డి, మిద్దెరాములు వంటి ఒగ్గు కళాకారుడికి జన్మనిచ్చిన ఉద్యమాల పురిటి గడ్డ వేములవాడ. దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచింది ఇక్కడి రాజన్న క్షేత్రం. భక్తుల కొంగు బంగారంగా విలసిల్లిన ఈ క్షేత్రం నాటి కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురైంది. రాజన్న నిధులన్నీ ఆంధ్రాలోని ఆలయాలకు తరలించగా, అభివృద్ధి జాడలేకపోయింది. ఇటు నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో అన్నింటా వెనకబడి పోయింది. కానీ, స్వరాష్ట్రంలో ప్రగతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక జిల్లా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రత్యేక కృషితో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నది. మొత్తంగా తొమ్మిదిన్నరేండ్లలో ₹4500 కోట్ల నిధులు కేటాయింపుతో ఆదర్శంగా మారింది. సాగు, తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు వంటి మౌలిక వసతులతో అభివృద్ధి కండ్ల ముందు సాక్షాత్కరించింది. వేములవాడను రెవెన్యూ డివిజన్‌గా మార్చడమే కాకుండా వేములవాడ రూరల్, రుద్రంగి, భీమారం మండలాలను కొత్తగా ఏర్పాటుచేయడంతో పరిపాలన మరింత చేరువైంది. ఇక సీఎం కేసీఆర్ మూడుసార్లు వేములవాడకు వచ్చి, రాజన్న దర్శించుకుంటే పదవులు పోతాయనే అపవాదు తొలగించగా, రాజన్న ఆలయ అభివృద్ధికి అంకుర్పాణ జరిగింది. వేములవాడ పట్టణంతోపాటు ఆలయాన్ని ప్రభుత్వం సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నది.

### వేములవాడ పట్టణ సమగ్రాభివృద్ధి

నియోజకవర్గానికి గుండెకాయలా ఉన్న వేములవాడ పట్టణాన్ని సమగ్రాభివృద్ధికి బాటలు వేశారు. ₹42కోట్లతో ఇంటింటికీ తాగునీరు, ₹36 కోట్లతో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, ₹2కోట్లతో మూలవాగు సుందరీకరణ, ₹2కోట్లతో మల్లారం జంక్షన్ నుంచి భీమేశ్వర గార్డెన్ వరకు పాదాచారుల రోడ్ల విస్తరణ, ₹2.37కోట్లతో కూడళ్ల సుందరీకరణ, ₹2కోట్లతో మున్సిపల్ కార్యాలయ భవనం, ₹2కోట్లతో వైకుంఠధామం, ₹1.37 కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టారు. అలాగే దాదాపు అన్ని వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు నిర్మించారు. పట్టణంలోని ప్రధాన రహదారులను నాలుగు వరసలుగా మార్చి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేశారు. వంతెనలను నిర్మించి మూలవాగుకు ఒడ్డాణంలా అలంకరించారు.

### అద్భుత దివ్యధామంగా రాజన్న క్షేత్రం

స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సీఎం హోదాలో ఇక్కడకు వచ్చి, రాజన్నను దర్శించుకున్నవారికల్లా పదవీగండం తప్పదనే అపవాదు ప్రచారంలోకి తెచ్చి ఇటు రాడమే మరిచిపోయిన నేతల కండ్లు తెరిపించారు. మొదటిసారి సందర్శించినప్పుడే ఆలయంతోపాటు పట్టణాన్ని సమగ్రాభివృద్ధి చేసేవిధంగా వేములవాడ ఆలయ ఏరియా అభివృద్ధి ప్రాధికార సంస్థ (వీటీడీఏ)ను ఏర్పాటుచేశారు. దీని ద్వారా ఇప్పటికే కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే రాజన్న క్షేత్రం దివ్యవైభవ క్షేతంగా తీర్చేందుకు అడుగులు పడగా, ₹400 కోట్లను ప్రకటించారు. అందుకు సంబంధించిన పనులు జరుగుతుండగా, ఆలయ విస్తరణ కోసం ₹30 కోట్లతో 30ఎకరాల భూమిని సేకరించారు. ₹100కోట్లతో గుడిచెరువు సుందరీకరణ పనులు చేపట్టారు. ₹17కోట్లతో మధ్యమానేరు నుంచి ఎత్తిపోతల ద్వారా రాజన్న చెంతకు గంగను చేర్చారు. ₹50 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ, అధునాతన వసతులతో బోనాల మండపం నిర్మిస్తున్నారు. రాజన్న సన్నిధికి వచ్చే భక్తుల కోసం ₹5కోట్లతో నీటి వసతి కల్పించారు. గుడిచెరువులో శివార్చన కళాశాల, రాజన్న ఆలయ అనుబంధ ఆలయం, నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై ₹10 కోట్లతో అభివృద్ధి పనుల అంచనాలు రూపొందించారు.

### మెట్టప్రాంతం సస్యశ్యామలం

తెలంగాణ వచ్చిన తర్వాత మెట్టప్రాంతమైన వేములవాడ నియోజకవర్గాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేశారు. నాటి పాలనలో అసంపూర్తిగా మిగిలిపోయిన మధ్యమానేరు రిజర్వాయర్ పూర్తి చేశారు. ₹1,500 కోట్లతో కోనరావుపేట మండలం మల్కపేటలో మూడు టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచి నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టుకు నీటిని ఎత్తిపోసేందుకు ₹163 కోట్లతో నిమ్మపల్లి, కోనరావుపేట పంప్‌హౌస్ నిర్మిస్తున్నారు. మల్కపేట ట్రయల్‌రన్ ఇప్పటికే పూర్తి కాగా, ఈ ప్రాజెక్టు ద్వారా వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో లక్షా 20వేల ఎకరాలకు సాగునీరందించనున్నారు. అలాగే ఎల్లంపల్లి వరద కాలువల ద్వారా 55వేల ఎకరాలకు సాగునీరు అందించారు. ఇంకా మిషన్‌కాకతీయ కింద ₹52 కోట్లతో 350 చెరువులను పునరుద్ధరించి, 40వేల ఎకరాలకు సాగునీరిస్తున్నారు. వరద కాలువ జీవనదిలా మార్చి కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో 10వేల ఎకరాలకు నీళ్లిస్తున్నారు. ₹62కోట్లతో మూలవాగుపై 12 చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. ఎటు చూసినా జలాలు పరుగులు తీస్తుండగా, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చేరువైన వైద్యం

నియోజకవర్గంలో దవాఖానలను బలోపేతం చేసి, వైద్య సేవలను మరింత చేరువ చేస్తున్నారు. వేములవాడలో ₹22.50కోట్లతో అధునాత వసతులతో వంద పడకల ఏరియా దవాఖానను భవనాన్ని నిర్మించి, పేదలకు కార్పొరేట్‌కు ధీటుగా వైద్యసేవలు అందిస్తున్నారు. లక్షలాది రూపాయల విలువైన కీలకమైన చికిత్సను పూర్తి ఉచితంగా చేస్తున్నారు. పదుల సంఖ్యలో మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేశారు. ప్రైవేట్‌కు మించి ప్రసవాలు కూడా చేస్తున్నారు. ఇంకా కంటి, దంత, ఇతర చికిత్సలను కూడా చేస్తున్నారు. ఈ దవాఖానకు నిత్యం 500 మందికి పైగా వస్తున్నారు. ప్రాణాంతకమైన క్యాన్సర్, పెరలాసిస్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో కదల్లేని స్థితిలో ఏండ్లకేండ్లు మంచానపడ్డవారి కోసం ఇదే దవాఖానలో పాలియేటివ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. నియోజకవర్గంలోని 49 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి ₹9.80కోట్లు మంజూరు చేశారు. ₹50కోట్లతో ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి, మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు.



గుడి చెరువు వద్ద గోదావరి జలాలకు పూజలు చేస్తున మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే (ఫైల్)

### నాణ్యమైన విద్య

విద్యా రంగానికి తగిన ప్రాధాన్యతనిస్తూ.. కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తున్నారు. నియోజకవర్గంలో ఆరు గురుకుల పాఠశాలలు, ఐదు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా, అగ్రహారం డిగ్రీ కాలేజీలో పీజీ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. వేములవాడ పట్టణం, వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి, రుద్రంగిలో ₹8కోట్లతో కస్తూర్బాగాంధీ విద్యాలయాలను నిర్మించారు. ₹48.20 కోట్లతో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించారు. 'మన ఊరు-మన బడి'లో భాగంగా మొదటి విడుతలో ₹25కోట్లు కేటాయించి, స్కూళ్లను ఆధునీకరిస్తున్నారు. ₹5 కోట్లతో వేములవాడ బాలుర ఉన్నత పాఠశాలను మోడ్రన్ పాఠశాలగా తీర్చిదిద్దనున్నారు.

### ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం

మధ్యమానేరు ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ వస్తున్నారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు ప్రత్యేక దృష్టిసారించి, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ₹89కోట్లు విడుదల చేయించారు. 18 ఏండ్ల యువతీ యువకులకు సైతం పరిహారం అందించారు. ఒక్కొక్కరికి ₹2లక్షల ప్యాకేజీ చొప్పున ₹14.31కోట్లు కొత్తవారికి ఇవ్వగా, గతంలో పెండింగ్‌లో ఉన్న 24,65 మంది యువతీ యువకులకు ₹63.31కోట్లు చెల్లించారు. ముంపునకు గురైన ఇండ్లకు ₹25 కోట్లు పరిహారం అందించారు. మిగిలి ఉన్న పనులను సైతం పరిష్కరించనున్నారు.



వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ ఏరియల్ వ్యూ

### రైతన్నకు అండగా

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు అండగా నిలుస్తున్నారు. రైతుబంధు కింద 60,664 మంది రైతులకు ₹672కోట్ల నిధులు ఖాతాల్లో వేశారు. 36,146 మంది రైతులకు ₹25.72 కోట్లు చెల్లించారు. అలాగే ఇప్పటివరకు మృతిచెందిన 482మంది రైతు కుటుంబాలకు ₹24.10కోట్ల బీమా చెల్లించారు. 28,526 మంది రైతులకు ₹92.20 కోట్ల రుణమాఫీ చేశారు. ₹5.94 కోట్లతో 27 రైతు వేదికలను నిర్మించారు.

### ప్రగతి పథంలో పల్లెలు

పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. అందుకోసం నియోజకవర్గంలోని 125 గ్రామ పంచాయతీలకు ప్రతినెలా ₹3.70 కోట్ల చొప్పున రెండేళ్లలో ₹88 కోట్లు అందించారు. ₹4.80కోట్లతో 60 జీపీలకు ట్రాక్టర్లు ఇచ్చారు. ₹34.40 కోట్లతో వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలు, డంప్‌యార్డ్‌లు ఏర్పాటు చేశారు. ₹9.60 కోట్లతో నూతన జీపీ భవనాలు నిర్మించారు. ₹2 కోట్లతో వేములవాడ కథలాపూర్ ఎంపీపీ భవనాలను కూడా నిర్మించారు. వ్యక్తిగత మరుగదొడ్లు నిర్మాణాలకు ₹18కోట్లు నిధులు కేటాయించారు.

### మెరుగైన రవాణా సౌకర్యం

నియోజకవర్గంలో ₹424.50 కోట్ల నిధులతో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రహదారులు నిర్మించారు. ₹35 కోట్లతో మర్రిమడ్ల నుంచి సిరిసిల్ల వరకు, ₹20 కోట్లతో మొత్కురావుపేట-చందుర్తి, ₹20కోట్లతో మేడిపల్లి నుంచి గోవిందరాం వరకు డబల్ రోడ్డు వేశారు. ఏనుగల్-మర్రిగడ్డ, మల్లారం నుంచి హనుమాజిపేట వరకు డబల్ రోడ్, చెక్కపల్లి చౌరస్తా నుంచి దొంగలమర్రి వరకు డబల్ రహదారి నిర్మించారు. ₹9కోట్లతో మేడిపల్లి నుంచి బోర్నపల్లి వరకు డబుల్ రోడ్ నిర్మాణాలు, వేములవాడ - కోరుట్ల రోడ్ మరమ్మతులు చేశారు. ₹68కోట్లతో సీసీ రహదారులు పూర్తి చేశారు. ₹36 కోట్లతో వంతెన నిర్మాణాలు కూడా చేశారు. పీఎంజీఎస్ ద్వారా ₹24కోట్లతో రహదారులు వేశారు. ₹52 కోట్లతో గ్రామాల్లోని రోడ్లు, ₹25 కోట్ల ప్రత్యేక నిధుల ద్వారా సీసీ రోడ్లు నిర్మించారు.

#### ప్రజల కోసం మరెన్నో

- మిషన్ భగీరథ కింద ₹542కోట్లతో 125 గ్రామాల్లో ఇంటింటికీ శుద్ధ జలం
- వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్, భీమారం, మేడిపల్లి మండలాల్లో లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు. మరో ₹42కోట్లతో 800 ఇండ్ల నిర్మాణం
- ₹8 కోట్లతో 5,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న రెండు గోదాముల నిర్మాణం
- ₹30కోట్లతో కథలాపూర్, నిమ్మపల్లిలో 133/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ₹10.75 కోట్లతో మరో తొమ్మిది 33/11 కేవీ సబ్‌స్టేషన్లు పూర్తి
- ₹6కోట్లతో శుద్ధజల కేంద్రాలు.. ₹6 కోట్ల సీడీపీ నిధులతో కుల సంఘ భవనాలకు ఆర్వో ప్లాంట్లు

### ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

సకలజనుల సంక్షేమమే లక్ష్యం గా ముందుకెళ్తున్నారు. ప్రభుత్వ ఫలాలను ఇంటింటికీ అందిస్తున్నారు. 58,216 మందికి సుమారు ₹852 కోట్లు ఆసరా పెన్షన్లు ఇచ్చారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద 8582 మంది కి ₹69.12 కోట్ల సాయం అందించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా 4997 మందికి ₹12.10 కోట్లు ఇచ్చారు. ఏటా లక్షా 5 వేల మంది మహిళలకు బతుకమ్మ చీరెలను అందిస్తున్నారు. 7745 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజ్ ద్వారా ₹105.26 కోట్ల రుణాలు మంజూరు చేసింది. దళితబంధు పథకానికి 100మందిని ఎంపిక చేసి ₹10కోట్లు అందజేశారు. గొర్రెల పంపిణీ పథకం కింద 4,166 మందికి ₹35 కోట్లతో యూనిట్లు పంపిణీ చేశారు. ఏటా 3510 మత్స్యకారులకు 33 లక్షల విలువైన 99.60లక్షల చేప పిల్లలను ఉచితంగా అందిస్తున్నారు.

#### నూతన ప్రతిపాదనలు

- తాండ్రియాల నుంచి కొడిమ్యాల వరకు డబుల్ రోడ్డు
- దేశాయిపేట నుంచి గోవిందారం వరకు డబుల్ రోడ్డు
- మోహనరావు పేట నుంచి దేశాయిపేట్ వరకు డబుల్ రోడ్డు
- ₹42 కోట్లతో శాభాష్‌పల్లి వంతెన నుంచి నందికమాన్ వరకు డబుల్ రోడ్డు
- ₹200 కోట్లతో కథలాపూర్ మండలంలో వరద కాలువపై అవసరమైన వంతెనల నిర్మాణం
- మన్నెగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం
- ₹10కోట్లతో ఎస్సారార్ ముంపు గ్రామాల పునరావాసానికి సంబంధించి చివరి చెల్లింపులు
- ₹42కోట్లతో వేములవాడ ప్రాంతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన చెరువులు, కాలువల మిగిలిన నిర్మాణాలు
- ₹25 కోట్లతో వేములవాడలో ఎల్లంపల్లి ప్రధాన కాలువపై అవసరమయ్యే 2 లిఫ్టులు, 12 ఓటీల నిర్మాణం
- ₹30 కోట్లతో వేములవాడలో ప్రధాన మురుగుకాలువ, శుద్ధి కేంద్రం నిర్మాణం
- ₹30 కోట్లతో చెక్ డ్యామ్‌లు, కరకట్టల నిర్మాణాలు
- ₹20కోట్లతో మర్రిపల్లిలో సమీకృత మారెట్, గిడ్డంగుల నిర్మాణం
- రుద్రంగి, భీమారంలో 30 పడకల దవాఖాన నిర్మాణం